



మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయి. రాజారాం తన ప్రక్కన పీటలమీద కూర్చున్న జయలక్ష్మి వైపు మురిపెంగా చూసుకుంటున్నాడు. పెళ్ళి కూతురు అలంకరణలో ముచ్చటగా వుంది జయ. సిగ్గో, చేరుకోగానే వంచిన తలఎత్తడం లేదు. 'ఒక్కసారి ఓరగా అయినా తనవేపు చూడేం? మరే ఇంత సిగ్గా!' అనుకున్నాడు రాజారాం.

'పెళ్ళయిపోయింది. శోభనమూ అయిపోయింది. రాజారాంకి భూమిమీద కాలు ఆనడం లేదు. చక్కటి భార్య. అందునా అత్తమామలకి ఒక్కతే కూతురు. బంగారం లాంటి నాలుగెకరాల పొలం, పొలాన్నానుకుని విశాలమైన ఆరు గదుల ఇల్లు. పల్లెటూళ్ళోనయితేనేం, పొలం ప్రక్క మంచే నేషనల్ హైవే. దగ్గర్లో వున్న పట్నం గాని పెరిగితే ఇంకొక పదేళ్ళలో ఎకరం అధమపక్షం పది, పదిహేను లక్షలు చేస్తుంది. అదనుచూసి ఇళ్ళస్థలాల కింద గాని అమ్మేశాడా, కోటీశ్వరుడయిపోవచ్చు. ఈ ప్లానంతా జయకి తెలియకూడదు. అమ్మో! తెలిస్తే ఇంకేమైనా వుందా? నువ్వెంత? నీ సంపాదనెంత? అని ఫోజు కొట్టెయ్యదూ! ఏదయినా భరించగలడు గాని, ఆడదాని ఆధిపత్యాన్ని సహించగలడా తను? అయినా తనకేం తక్కువ? తన తండ్రిపోయాక వచ్చిన ఆరు లక్షలూ ప్రస్తుతానికి అమ్మ పేరునే వున్నా ఒక్కడే కొడుకు గనక అవి ఖచ్చితంగా తనకే వస్తాయి. పట్నంలో వుంది కనుక తమ ఇల్లు కూడా ఆ రోజున పది లక్షలకి తక్కువ చెయ్యదు. సెంట్రల్ గవర్నమెంట్‌లో బంగారం లాంటి ఉద్యోగం తనది. జీతమూ ఎక్కువే. పై సంపాదనా ఎక్కువే. తనలాంటి భర్త దొరకడం జయకి మాత్రం అదృష్టం కాదూ!

పక్కకి తిరిగి అలిసిపోయి నిద్రపోతున్న భార్యని తట్టి లేపుతూ అన్నాడు. "ఏయ్ పల్లెటూరి పిల్లా! మొదటి రాత్రి నిద్రపోకూడదని మీ పల్లెటూర్లో నీకెవరూ చెప్పలేదా?" అని.

మామగారి డబ్బుతో భార్యని తీసుకుని హనీమూన్‌కెళ్ళొచ్చేసేడు రాజారాం. ఇంట్లో అడుగు పెట్టేసరికి చంకలో మూడేళ్ళ పసిపిల్లతో ఎదురయింది తల్లి అరుణమ్మ. తల్లికి ఆడ పిల్లలంటే మోజెక్కువని తెలుసు రాజారాంకి. ఇరుగు పొరుగు వాళ్ళ పిల్లల్ని ఆవిడ చేరదియ్యడమూ అతనికి మామూలే. అందుకనే పెద్ద పట్టించుకోలేదు. కాని ఆ రోజు రాత్రే బాంబు పేల్చింది అరుణమ్మ.

"రాజా! మీ నాన్నగారు పోయాక బొత్తిగా తోచడం లేదురా. నీకు కూడా పెళ్ళయింది కనుక నీ అవసరాలు ఇకమీదట మీ ఆవిడ చూసుకుంటుంది. నాకేం తోస్తుంది చెప్పు, అందుకని అనాధ శరణాలయం నుంచి ఈ పసిపిల్లని తెచ్చుకున్నాను. ఇంక మమత అదే ఈ పాప మన దగ్గరే ఉంటుంది" అంది.

అదిరిపడ్డాడు రాజారాం. "నీకేమైనా మతిపోయిందా అమ్మా? ఇంకొక ఏడాది ఆగితే మాకే ఒక పిల్ల పుట్టదా? ఈలోగా తొందరపడి ఆ లంపటాన్నెందుకు తెచ్చేవు? రేపే వెళ్ళి ఇచ్చేసిరా. "ఆజ్ఞ జారీ చేశేడు. అయితే అతనన్నట్టు అరుణమ్మ ఆ పిల్లని తిరిగి ఇచ్చెయ్యలేదు సరికదా, పదే పదే అతను ఆ విషయమై వత్తిడి చేస్తుంటే "పోనీ లేరా, నీ కిష్టం లేకపోతే మానెయ్యి. మీ నాన్నగారి

దయవల్ల నా దగ్గర ఆరు లక్షలున్నాయి. ఎలాలే దన్నా నెలకయిదు వేలు వడ్డీ వస్తుంది. దొడ్లో అద్దెకున్న వాళ్ళని ఖాళీ చేయించి అందులో నేనూ, మమతా వుంటాం" అని అల్టిమేటం ఇచ్చేసింది.

"ఇదెక్కడి గోల?" మతిపోయింది రాజారాంకి. ఇల్లూ, డబ్బూ నాన్నగారి స్వార్జితం. ఆయన పోతూ పోతూ అన్నీ అమ్మ పేరున పెట్టేరు. ఈవిడ అంతా ఆ అనాథ పిల్లకి రాసిచ్చినా ఇచ్చెయ్యగలదు. ఏదయినా తెగేదాకా లాగకూడదు అనుకున్నాడు.

"సరేలే నువ్వంత పట్టపడితే నేను మాత్రం ఏం చెయ్యగలను? ఈ మాత్రానికి విన్ను వేరు పెట్టేనవే చెడ్డపేరు నాకెం దుకు? ఇంట్లోనే వుండండి" అని తప్పుకోబోయేడు.

అయితే అరుణమ్మగారు మాత్రం అలా వద లలేదు. "ఇంత ఇష్టంలేని వాడివి రేపు నేను పోతే ఈ పిల్లని రోడ్డుమీదకి గెంటవన్న నమ్మకం ఏమిటి? నిజంగా నేనీ ఇంట్లో వుండాలనే అను కుంటే, నువ్వూ, జయ కలిసి మమతని దత్తత తీసుకోండి"

జయరాంకి తల తిరుగుతోంది. తల్లెందుకింత పట్టువిడుతోంది. నిజంగా తన ఉద్దేశం అదే. తల్లె న్నాళ్ళు బ్రతుకుతుంది? తరవాతాపిల్ల నెలాగో ఏదో ఒక అనాథాశ్రమంలో చేర్పేద్దామనుకున్నాడు. కానీ ఇలా ఎదురు తిరుగుతుందనుకోలేదు. "నన్నాలో చించుకోనీ" అని అప్పటికి బయటపడ్డాడు.

వారం రోజుల తరువాత ఒక రోజు ఉదయాన్నే తలంటుకుని తయారై వచ్చిన జయ రాజారాంని నిద్రలేపింది. "లేవండి తొందరగా. అవతల బ్రాహ్మడూ, పెద్ద మనుషులు వచ్చి కూర్చున్నారు" అంటూ.

బయటికొచ్చి చూసి తెల్లబోయేడు రాజారాం దత్తతకి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసుకుని రాజారాం కోసమే ఎదురుచూస్తున్నారందరూ. భార్యని చెయ్యి పట్టి పక్కకి లాగి "నువ్వు కూడా ఏమిటి? అమ్మతో పాటు నీకూ పిచ్చెక్కిందా?" అన్నాడు సీరియస్‌గా.


"పోనిద్దురూ ఇప్పుడు గొడవపడితే ఏం లాభం? అయినా ఒక్కపిల్ల తిండికీ, బట్టకీ ఏమంత ఖర్చయిపోతుందని వద్దంటున్నారు?" వీరకుచ్చిళ్ళు సర్దుకుంటూ తేలికగా అంది జయ.

తల పట్టుకుని కూర్చున్నాడు రాజారాం. ఇప్ప డింతమందిలో గొడవపడితే, లోకుల దృష్టిలో తల్లి, అనాథపిల్లని ఉద్ధరించే దేవత, తాను అడ్డుపడ్డ రాక్షసుడు అయిపోతారు. అయినా తన తల్లసలే మొండిఘటం. తను కాదన్నాడన్న కోపం కొద్దీ ఇల్లూ, డబ్బూ ఆ పిల్ల పేర రాసేసి, వచ్చినవాళ్ళచేత సాక్షి సంతకం పెట్టించేసినా పెట్టించెయ్యగలదు. జయ చెప్పిందే నిజం. ఏదో ఇంత తిండిపడేస్తే అదే పెరిగి పెద్దవుతుంది. అయిష్టంగానే వళ్ళు కొరు కుతూ లేచి దత్తత స్వీకారానికి తయారయ్యేడు.

ఏడాది గిర్రున తిరిగింది. జయ, అరుణమ్మ కలిసి లక్షణంగా అక్షరాభ్యాసం చేసి మరీ మమతను స్కూల్లో వేశేరు. దత్తత అయిన దగ్గర నుంచి జయ మమతకి కన్నతల్లే అయింది. వాళ్ళిద్దరి ముద్దూమురిపాలతో ఆ పిల్ల మహారాణిలాగే పెరుగుతోంది. అయితే రాజారాం పిలిస్తే మాత్రం మమతని అత్తగారికిచ్చేసి వెంటనే భర్త దగ్గరకొచ్చే సేది జయ. ముందు అతని అవసరాలు చూసేకే మిగిలిన విషయాలు పట్టించుకునేది. అది రాజా రాంకి సంతృప్తిగానే వున్నా మమతనంత ముద్దు చెయ్యడం మాత్రం సహించలేకపోయేవాడు.

ఇప్పుడు జయ నిండు చూలాలు. పాపో, బాబో పుడితే వాళ్ళే ఆ పిల్లని దూరం పెడతారు. ఎంతయినా సొంతవాళ్ళు సొంతవాళ్ళే కదా! అను కున్నాడు రాజారాం.

ఆ రోజు ఆదివారం. జయ మమతకి స్నానం చేయించి ముస్తాబు చేస్తోంది. అరుణమ్మ గారు వంటింట్లో టిఫినుకి సన్నాహాలు చేస్తున్నారు. రాజారాం డ్రాయింగ్ రూమ్‌లో తన కాలేజీ




ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)
రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు)
సంయుక్తంగా నిర్వహించిన
1997 కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

స్నేహితుడు చలపతితో మాట్లాడుతున్నాడు.

"అప్పుడు నువ్వు మీ ఊళ్ళో ఏదో ప్రేమా యణం వెలగబెట్టేవు కదా! నిరుద్యోగపర్వంలో ఖాళీగా వుండకుండా, అదేమయింది?" నవ్వుతూ అడిగేడు రాజారాం.

"అదా! ఆ అమ్మాయి బాగుంటుందిరా. నాకె లాగా ఉద్యోగం రాలేదు. మా నాన్నకున్న రెండెక రాలూ, వాళ్ళకున్న అయిదెకరాలూ మొత్తం కలిపి సాగు చేసుకుంటే జీవితం గడిచిపోతుందనుకు న్నాను. తను కూడా మంచి వయసులో వుందేమో ఆవేశంలో హద్దులు కూడా దాటేసేం. ఇంతలో మా బంధువొకాయన కూతురికి ఏక్సిడెంట్‌లో కాలు పోయింది. మామూలుగా అయితే మాలాంటి వాళ్ళవేపు కన్నెత్తి కూడా చూడని ఆయన, కూతు ర్నిచ్చి కొడుకుతో సమానంగా ఆస్తిలో వాటా కూడా ఇస్తామని, ఇక్కడున్న పొలం అమ్మేసుకుని రమ్మని కబురు పెట్టేరు. వాళ్ళకున్న ఫ్యాక్టరీలు, షెడ్లు, బంగళాలూ అన్నీ కలిపితే ఏలా లేదన్నా నా వాటాకి ముప్పై, నలభై లక్షల ఆస్తి వస్తుంది. వెంటనే అవకాశం అంది పుచ్చుకున్నాను. ఎగిరిపోయాను" తను కూడా నవ్వుతూ అన్నాడు చలపతి.

"మరి నువ్వు ప్రేమించిన అమ్మాయి ఊరు కుందా?" కుతూహలంగా అడిగేడు రాజారాం.

"ఊరుకోలేదు. ఏడ్చింది. నువ్వు కూడా కడుపు తీయించుకుని ఇంకో అమాయకుడికి వలెయ్యి" అని చెప్పేను.

స్నేహితులిద్దరూ పెద్దగా నవ్వుకున్నారు.

టిఫిన్ ప్లేట్లు పట్టుకుని ఆ గదిలోకి ప్రవేశించిన జయ గుమ్మం దగ్గరే స్థాణువులా నిలబడిపో యింది.

"రా! జయా! అక్కడే ఆగిపోయావేం? ఇతను చలపతని నా కాలేజీమేట్. ఆమె నా భార్య

జయ" అంటూ చలపతి వైపు తిరిగి తెల్లబోయేడు రాజారాం. రెప్ప వెయ్యకుండా జయవైపే చూస్తూ నిలుచుని వున్నాడు చలపతి.

జయ చేతిలోని ప్లేట్లు భళ్ళుమని శబ్దం చేస్తూ కిందపడిపోయాయి. కసాయివాడిని చూసిన మేకలా 'అత్తయ్యా!' అంటూ కేకపెట్టి నేలమీద కూలబడిపోయింది జయ.

అరుణమ్మ పరుగెత్తుకుని వచ్చింది. పిచ్చిదానిలా శూన్యంలోకి చూస్తున్న జయ భుజంమీద చెయ్యేసి "ఏం జరిగింది జయా!" అంది ఆత్రంగా.

"వాడు... ఆ చలపతి... ఆయన స్నేహితుడు" మాటలు పేర్చుకుంటూ అంది జయ. తిరిగి చూస్తే స్నేహితులిద్దరూ అక్కడ లేరు. చప్పున కోడల్ని పొదివి పట్టుకుని కూర్చుండిపోయింది అరుణమ్మ.

నిప్పులు కక్కుతూ ఇంటికి తిరిగివచ్చేడు రాజారాం. గోడకానుకుని అలాగే కూర్చుని వున్నారు జయ, అరుణమ్మ. అరుణమ్మ ఒళ్ళో మమత కూర్చుని వుంది.

"ఛీ ఇంకా ఇక్కడే వున్నావా? ముందు బయటికి నడు" అరుస్తూ వచ్చి జయ చెయ్యి పట్టుకోబోయేడు రాజారాం.

"ఆగు" తీవ్రంగా హెచ్చరించింది అరుణమ్మ. "జయ వంటిమీద చెయ్యేశావా జాగ్రత్త!"

"నీకు తెలీదమ్మా ఇదెంత పాపిష్టిదో..."

"నీ స్నేహితుడికన్నా పాపిష్టిదా?" మధ్యలోనే ఆపింది అరుణమ్మ.

"అయితే నీకన్నీ తెలుసన్నమాట. తెలిసే ఈ ఛండాలవుదాన్ని సమర్థిస్తున్నావా?"

"నోర్ముయ్" ఆవేశంగా లేచి కొడుకు చెంప ఛెళ్ళుమన్పించింది అరుణమ్మ. "ఎవరిదిరా ఛండాలం? నీదా, జయదా? ఇంతవరకూ వచ్చింది కనుక అసలు జరిగింది నీకు చెప్తాను విను. నువ్వు వార్తులో పల్లెటూళ్ళో చేసిన నిర్వాకం నాకు తెలియదనుకోకు. మీ నాన్నగారు అర్ధాంతరంగా గుండెపోటుతో చచ్చిపోతూ మనవల్ని చూసుకోలేదని మధనపడినప్పుడు కూడా నువ్వు నీ కొడుకు గురించి మాకు చెప్పలేదు. ఒకరోజు నీ గది తుడుస్తూ వుంటే చింపేసిన ఉత్తరం ముక్కలు కనిపించేయి. ఈ పిల్లాడు చచ్చిపోతాడు అన్న వాక్యం కనిపించి అన్ని ముక్కలూ ఒకచోట చేర్చి చదివేను. నిన్నే నమ్మి సర్వం అర్పించిన ఆ అనాథ పిల్లని మోసం చెయ్యడం తగదని, నీకు ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు రాలేదని. ప్రస్తుతం నీ కొడుకు జబ్బు పడ్డాడని, స్కూలు మాస్టరయిన తను జాలిపడగలడే గాని వైద్యం చేయించలేడని, నెలకొక్క నాలుగు వందలు పంపితే వాళ్ళు బ్రతుకుతారని, లేకపోతే అన్యాయంగా ఆ పిల్లాడు చచ్చిపోతాడని అందులో రాసుంది. నిర్ఘాంతపోయాను. నిన్నడిగినా నువ్వు నిజం చెప్తావనే నమ్మకం నాకు కలగలేదు. అందుకే తీర్థయాత్రలనేపంతో ఉత్తరదేశం బయలుదేరాను. తిన్నగా ఆ అడ్రసు పట్టుకుని వెతుక్కుంటూ వెళ్ళేను. అంతదూరం వెళ్ళి నేను అందుకోగలిగింది ఇదుగో నీ భార్యా, కొడుకు ఫొటో మాత్రమే" కొడుకు మొహం మీదకి ఒక ఫొటో విసిరేసింది అరుణమ్మ.

"అనారోగ్యంతో పిల్లాడు మరణించాడనీ, ఆ బాధ తట్టుకోలేక ఆ అమాయకురాలు కూడా ఆ రాత్రే నూతిలోకి దూకి చచ్చిపోయిందనీ ఏ సంబంధమూ లేని ఆ స్కూలు మాస్టరు ఏడుస్తూ చెప్పేడు. నిరాశగా వెనుతిరిగేను. తిరుగు ప్రయాణంలో మీ నాన్నగారి స్నేహితుడు తారసపడి వాళ్ళింటికి తీసుకువెళ్ళేరు. వాళ్ళమ్మాయి జయ. అక్కడ ఇంకో విషాదగాథ విన్నాను. ప్రేమించినవాడు మోసం చేస్తే, ఏ పాపమూ ఎరుగని పసిబిడ్డని చంపుకోలేక, ఒక ఎకరం పొలం అమ్ముకుని తీర్థయాత్రల నెపంతో దూర ప్రాంతాలకి వెళ్ళిపోయి పుట్టిన పసిపిల్లని మనవూళ్ళోనే ఒక నర్సుకి పెంపకానికిచ్చి, ప్రతినెలా డబ్బు పంపి ఆ పిల్లని పెంచుతూ వున్నారు వాళ్ళు. ఎలాగయినా కూతురికి పెళ్ళి చేసి ఆ పసిబిడ్డని వాళ్ళే పెంచుకోవాలని వాళ్ళ తాపత్రయం. అయితే మోసం చేసి పెళ్ళి చెయ్యలేక. నిజం చెపితే ఎవరూ చేసుకోరనే భయంతో రోజులు గడిపేస్తున్నారు వాళ్ళు. ఆ తల్లినీ పిల్లనీ ఆదుకుంటే నువ్వు చేసిన పాపం, నిన్ను కని నేను చేసిన పాపం కొంతయినా ప్రక్షాళన



అవుతాయనిపించి మీ పెళ్ళి నేనే జరిపించేను. ఈ మమతే జయ కూతురు" ఆగింది అరుణమ్మ.

"కన్నతల్లివయ్యుండి ఇంత మోసం చేస్తావా? ఇప్పుడే ఈ జయని బయటికి గెంటేస్తాను. నేను లక్షణంగా ఇంకో పెళ్ళి చేసుకుంటాను. ఎవరడ్డమొస్తారో చూస్తాను" కోపంతో ఊగిపోతూ అన్నాడు రాజారాం.

"నేనే అడ్డమొస్తాను. నా పేరనున్న డబ్బూ, ఈ ఇల్లూ, జయవాళ్ళ నాన్నగారి పొలమూ, ఆస్తీ, అన్నీ జయ పిల్లలిద్దరి పేరునా రాసి జయని గార్డియన్‌గా పెట్టేం. ఎందులోనూ నీకు చిల్లిగవ్వ రాదు. ఇంక ఇంకో పెళ్ళంటావా, నువ్వా పిచ్చి ప్రయత్నం చేస్తే వెంటనే నేనొక పేపరు నోటీసు ఇస్తాను. నా కొడుకు పిచ్చివాడు. వాడు పెళ్ళాం పిల్లల్నొదిలేసి కట్నం కోసం ఇంకో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. వీడినెవరూ నమ్మకండి అని నీ ఫొటోతో సహా వేయిస్తాను. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. దేశంలో వున్న అన్ని పేపర్లలోనూ నెల రోజులు వరుసగా వచ్చేలా చేస్తాను" దృఢంగా అంది అరుణమ్మ.

నిజంగా పిచ్చివాడిలాగే నిలబడి చూస్తున్నాడు రాజారాం.

జయ మెల్లగా లేచింది. సూటిగా భర్త కళ్ళలోకి చూసింది. "తొందరగా స్నానం చేసి రండి. భోజనం వడ్డిస్తాను" అంటూ లోపలికి నడిచింది. నిండు గర్భిణి, ఎంతో ఆత్మవిశ్వాసంతో అలా నడుస్తూ వుంటే "ఎంతో అందంగా ఉంది 'జయ".

